## 58,696 కోట్లు



44,74,682 లబ్ధిదారులకు పింఛన్ల కోసం ఇప్పటి వరకు ప్రభుత్వం చేసిన ఖర్చు. దివ్యాంగులకు నెలకు రూ.4,016, వివిధ వర్గాలకు చెందిన అర్హులైన నిరుపేదలకు నెలకు రూ. 2,016 చొప్పున పింఛన్ అందజేత.


### థర్డ్ అంపైర్



కంపెనీల అధిపతులు టీలు, కాఫీలు ఇస్తే రారు. నగరంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆరా తీసుకున్నాకే అడుగు ముందుకువేస్తారు. నీళ్లు, సోషల్ లైఫ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సెక్యూరిటీ అన్నీ చూసుకుంటారు. శాంతిభద్రతల విషయంలో సంతృప్తి చెందితేనే ఏ సంస్థనైనా నెలకొల్పడానికి ముందుకొస్తారు. మన దగ్గర ఇవన్నీ ఉండబట్టే.. ఆపిల్ నుంచి ఉలు వరకు ఇన్ని సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయి.

▪ విశాల రెడ్డి, ఐడెంటిసిటీ వ్యవస్థాపకురాలు

### థౌజండ్ వాలా..





కౌంట్ డౌన్ 29

I

తెలంగాణ జైత్రయాత్ర 2023

హైదరాబాద్ | బుధవారం 1 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

www.ntnews.com




### శాంతిభద్రతలే ప్రధానం

లా అండ్ ఆర్డర్ అదుపులో ఉన్నప్పుడే సంక్షేమం, అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించగలదు. తెలంగాణ ఏర్పాటైతే తీవ్రవాదులు వచ్చేస్తారని, శాంతిభద్రతలు గతి తప్పుతాయని చాలామంది విష ప్రచారాలు చేశారు. కానీ, వాటన్నిటినీ పటాపంచలు చేసిన ఘనత తెలంగాణ పోలీసులకు దక్కుతుంది. నేను ఢిల్లీకి వెళ్లినప్పుడు అక్కడి ప్రజాప్రతినిధులు 'యంగెస్ట్ స్టేట్ ఆఫ్ ఇండియా.. గ్రేటెస్ట్ పోలీస్ ఆఫ్ ఇండియా' అని మనవాళ్లను ప్రశంసించినప్పుడు ఆనందం కలిగింది. ▪ కేసీఆర్



దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ ప్రభాకర్ రెడ్డిపై కాంగ్రెస్ దాడితో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తెలంగాణ జనుల మనసు గతంలోకి తొంగిచూసింది. అధికారం కోసం, ఓట్ల కోసం, ఎన్నికల కోసం.. శాంతిభద్రతల సమస్యలు సృష్టించడం కాంగ్రెస్‌కు అలవాటైన విద్యే. కుర్చీల వేటలో అది నెత్తుటి వేట కొనసాగిస్తుంది. 1990లో జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనం..

# నెత్తుటి వేట.. కాంగ్రెస్ కుర్చీలాట!

- సొంత పార్టీ సీఎంను దించేందుకు నగరంలో నరమేధాలు సృష్టించిన గతం
- హైదరాబాద్ గంగా-యమున తహజీబ్ సంస్కృతిని కాలరాసిన కాంగ్రెస్
- 1990 అల్లర్లలో వందలాది మంది అమాయకులు బలి
- సొంత పార్టీలోని ప్రత్యర్థులు రాజేసిన చిచ్చు అని ప్రకటించిన నాటి సీఎం చెన్నారెడ్డి
- పదవుల కోసం దేనికైనా వెనుకాడని కాంగ్రెస్ చరిత్ర
- అవసరమైతే ఇతర పార్టీ నేతలపైనా దాడులు సాగించేందుకు తెగింపు
- ఇదే కోవలో దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం
- తాజా ఎన్నికల్లోనూ సీఎం కుర్చీ కోసం పలువురు హస్తం నేతల వెంపర్లాట

**ఆ రోజు...**

**1990 డిసెంబర్ 7.. పాతబస్తీలో అల్లర్లు..**

**నగరమంతా పుకార్లు.. రాష్ట్రమంతా అలజడి..**

గంగా-యమున తహజీబ్ సంస్కృతికి నిలువుటద్దంలా ఉన్న హైదరాబాద్ నరమేధంతో నిలువునా వణికిపోయింది. మర్నాడు సూర్యుడు ఉదయించేసరికి.. రాజధాని రక్తసిక్తమైంది. ఆనాడు అల్లరిమూకలు సృష్టించిన నరమేధంలో సుమారు 300 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఐదారువందల మందికి గాయాలయ్యాయి. ఏకంగా 25 రోజుల పాటు హైదరాబాద్ కర్ఫ్యూ చెరలో బందీగా మిగిలింది. డిసెంబర్ చలిలోనూ నగరమంతా వేడెక్కింది. ఆ వేడి రాష్ట్రమంతా సెగలు కక్కింది. సున్నితమైన ప్రాంతాల్లో నెల రోజులు దినదిన గండంగా గడిచాయి.

... ✍ గుండాల కృష్ణ



సీఎం కుర్చీ కొట్లాటే ఆ నరమేధానికి కారణం. అప్పుడు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన మర్రి చెన్నారెడ్డి స్వయంగా చెప్పిన మాటలు ఇవి.. 'నన్ను సీఎం పదవి నుంచి తొలగించేందుకు సొంత పార్టీ అయిన కాంగ్రెస్‌లోని ప్రత్యర్థులు చేసిన 'ఇంజినీర్డ్ వయలెన్స్ '(సృష్టించిన హింస).'

మర్రి చెన్నారెడ్డి తనయుడు, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి ఇప్పుడు చెబుతున్న ప్రకారం... 'ఒక కత్తితో హిందువును చంపి.. అదే కత్తితో ముస్లింను ఊచకోత కోసిన ఘటన అది. వాస్తవానికి అది మత కల్లోలం కాదు. ఒకరిని అధికారం నుంచి తొలగించేందుకు జరిగిన కుట్ర.'

**ఉమ్మడి** రాష్ట్ర రాజధానిగా అవతరించిన హైదరాబాద్ చరిత్రలో కాంగ్రెస్ పాలన చూస్తే కొన్ని రక్తపు మరకలున్న పేజీలు కనిపిస్తాయి. అవన్నీ కాంగ్రెస్ నేతల పదవీ కాంక్షకు దర్పణం పడతాయి. ఓట్ల కోసం ఫీట్లు చేసే నాయకులను చూశాం. అధికారం కోసం తమలో తాము తన్నుకున్న సందర్భాలూ చూశాం! కానీ, ప్రజల కోసం.. ప్రజల చేత ఏర్పాటు చేసుకున్న ఈ ప్రజాస్వామ్యంలో కుర్చీల కోసం తమను ఎన్నుకున్న ప్రజలనే బలి చేసిన దౌర్భాగ్య రాజకీయాన్ని ఊహించగలమా? కానీ, కాంగ్రెస్ రాజకీయ ప్రస్థానంలో ఆ నెత్తుటి మరకలు నేటికీ పచ్చిగానే ఉన్నాయి. కుట్ర చేసిందెవరు? దాంతో కుర్చీ కోల్పోయిందెవరో? ముఖ్యం కాదు! తమ పంతం నెగ్గించుకోవాలన్న నాయకులను పెంచి పోషించిన రాజకీయ పార్టీ ఏదన్నది ప్రధానం!! నెత్తుటి సంస్కృతి దాని విధానం!!

**ఎవరో** రాజకీయ ప్రత్యర్థులు ఆరోపణలు చేస్తే నమ్మాల్సిన అవసరం లేదు. సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి స్వయంగా తమ స్వపక్ష నేతల వైపు వేలెత్తి చూపిన తర్వాత ఇంతకంటే రుజువు ఏం కావాలి? ఆ హింసా సంస్కృతి పునరావృతం కాదన్న గ్యారంటీ ఎవరిస్తారు?? ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో జోరుగా సాగుతున్న చర్చ ఇది. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నమూ ఇదే కోవలో చూడాలని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఓట్ల స్థాయిలోనే పరిస్థితులు ఇలా ఉంటే... ఒకవేళ అధికారం 'హస్త'గతమైతే పదవుల కోసం ఇదే దమననీతి కొనసాగించేందుకు కాంగ్రెస్ నేతలు ఏమాత్రం వెనుకడుగు వేయరని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా నోటిఫికేషన్ జారీ కాకముందే కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి నేనే అంటూ పలువురు నేతలు పోటీ పడి మరీ ప్రకటనలు చేస్తుండటం ఇందుకు మరింత బలాన్ని చేకూరుస్తున్నట్లయింది.

### బందులబాదు

కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్ అంటేనే కర్ఫ్యూలకు కేరాఫ్. దశాబ్దాల పాటు ఏటా ఏదో సందర్భంలో బందుల ఇబ్బందులను భాగ్యనగరి చవి చూసింది. మతసామరస్యానికి ప్రతీకగా ఉండే రాజధానిలో తరచూ ప్రశాంతత భగ్నం కావడం వెనుక అనేక..


మిగతా 3వ పేజీలో..






### ఆ మరకలను తుడిచేసిన సీఎం కేసీఆర్..

**యథా రాజా...** తథా ప్రజా అని ఊరికే అనలేదు. పాలకుల చిత్తశుద్ధికి అనుగుణంగా పరిపాలన విధానం కొనసాగుతుంది. అందుకే హైదరాబాద్ నగర ప్రస్థానం తెలంగాణ ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత అనే రీతిలో కనిపిస్తున్నది. నగరంలో ఎప్పుడైనా, ఏమైనా జరగవచ్చనే భయం నుంచి దేశంలోనే అత్యంత ప్రశాంతమైన, సురక్షితమైన నగరం హైదరాబాద్ అని అంతర్జాతీయ ఖ్యాతికి ఎదిగింది. 2014 నుంచి ఇప్పటివరకు నగరంలోనే కాదు.. రాష్ట్రంలో ఎక్కడా కూడా కల్లోలాలు చెలరేగిన దాఖలాలు లేవు. హైదరాబాద్ చరిత్రలో వరుసగా పదేండ్లలో ఒక్క క్షణం కూడా కర్ఫ్యూ విధించని సరికొత్త రికార్డును కేసీఆర్ ప్రభుత్వం లిఖించింది. వాస్తవానికి పెట్టుబడులు పెట్టాలంటే అంతర్జాతీయ కంపెనీలు ప్రప్రథమంగా పరిశీలించే కొలమానం... శాంతిభద్రతలు. అవి సంతృప్తికరంగా ఉంటేనే ఆపై మౌలిక వసతులు, భౌగోళిక అనుకూలతలు ఇలా ఇతర అంశాల గురించి ఆలోచిస్తారు. నగరంలో శాంతిభద్రతలు పక్కాగా ఉండబట్టే విదేశాల నుంచి ఐటీ కంపెనీలు, బహుళ జాతి సంస్థలు రెక్కలు కట్టుకొని వచ్చి హైదరాబాద్‌లో వాలుతున్నాయి. పాలకుడు మత సామరస్యాన్ని కాపాడటంతో పాటు పటిష్టమైన శాంతిభద్రతలను నిర్వహిస్తున్నందునే... ప్రజలు కూడా అదే బాటలో నడుస్తున్నారు. అందుకు ఉదాహరణగా... గతనెల 28వ తేదీన గణేష్ నిమజ్జనంతో పాటు అదేరోజు మిలాద్-ఉన్-నబీ కూడా వచ్చింది. రెండు పర్వదినాలూ ఒకేరోజు జరగడం ఇబ్బందిగా ఉంటుందని గుర్తించిన ముస్లిం సోదరులు మిలాద్-ఉన్-నబీ ఊరేగింపును వాయిదా వేసుకొని మతసామరస్యానికి హైదరాబాద్ నిలయమని మరోసారి రుజువు చేశారు.

### ప్రశాంత తెలంగాణపై 'కత్తి'..

**ఉమ్మడి** ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉన్నా.. తెలంగాణ వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రం ప్రశాంతంగా ఉంది. పదేండ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమం ఇవే తప్ప సామాజిక, మత, రాజకీయ ఘర్షణలు చోటుచేసుకోలేదు. ఈ దశాబ్దిలో రెండేసి సార్లు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు, ఇతర ఉప ఎన్నికలతోపాటు జీహెచ్ఎంసీ సహా స్థానిక సంస్థల ఎలక్షన్లు కూడా వచ్చాయి. ఎక్కడా చిన్నపాటి సంఘటనలు జరగలేదు. కానీ, తాజా ఎన్నికల్లో మాత్రం హింసా మార్గానికి ద్వారాలు తెరుచుకోవడం ఆందోళన కలిగించే పరిణామం. వాస్తవానికి తెలంగాణ రాజకీయ ప్రస్థానంలో ఇలాంటి సంస్కృతి ఎక్కడా కనిపించదు. ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలోనూ వ్యక్తిగత దాడులకు పాల్పడిన సందర్భాల్లేవు. కానీ, సోమవారం దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తి దాడి తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా కలిచివేసింది. తెలంగాణ ఏర్పాటయ్యాక ఎన్నడూ చూడని విష సంస్కృతి మళ్లీ పురుడు పోసుకోవడం అందరినీ ఆలోచింపజేస్తున్నది. ఎన్నికల పోరులో భాగంగా ప్రతి కార్యకర్తను ప్రజాక్షేత్రంలో ఒక సైనికుడిగా మార్చాల్సిన నేతలు ఇలా భౌతిక దాడులకు పాల్పడే రీతిలో పురిగొల్పడం ప్రమాదకరమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.